సాక్షి శ్రీకాకుళం

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



ఉత్సాహంగా గ్రిగ్స్ పోరు

గ్రిగ్స్ మీట్ ఫైనల్ పోరు ఉత్సాహంగా జరిగింది. క్రీడాకారులు ప్రతిభ చూపించారు.

- IIలో



సమీకృత కలెక్టరేట్..

సమీకృత కలెక్టరేట్ నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

- IIలో

19 నుంచి కోర్టు విధులకు న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీ లాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను నిరసిస్తూ మూడు నెలలుగా సమ్మె చేస్తున్న న్యాయవాదులు ఈనెల 19 నుంచి కోర్టు విధులకు హాజరు కానున్నారని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు అన్నారు. శుక్రవారం బార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మెజారిటీ న్యాయవాదుల అభిప్రాయం మేరకు ఈ నెల 19 నుంచి సమ్మెను విరమించి కోర్టు విధులకు హాజరవుతారని చెప్పారు.

న్యూస్‌రీల్

‘రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి’



రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ ఆర్‌జేడీ చిన్మయిదేవి

శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలని ఐసీడీఎస్ ఆర్‌జేడీ చిన్మయిదేవి అన్నారు. శ్రీకాకుళంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని దండివీధి 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఐసీడీఎస్ ఆర్‌జేడీ చిన్మయిదేవి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీలు పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్మయిదేవి మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు సరుకులను సక్రమంగా అందజేయాలని, చిన్నారులకు ప్రీ స్కూల్ విద్యను సక్రమంగా నేర్పించాలన్నారు. అనంతరం చిన్మయిదేవి లబ్ధిదారులకు టేక్ హోమ్ రేషన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన ప్రీ స్కూల్ నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ జి.శోభారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.సీతామహలక్ష్మి, కార్యకర్తలు నాగమణి, పార్వతి, ఉషారాణి, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

ఇచ్ఛాపురానికి ప్రవీణ్ ప్రకాష్ రాక నేడు

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శనివారం ఇచ్ఛాపురం వస్తున్నారని మండల విద్యాశాఖాధికారి కురమాన అప్పారావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం ట్రైన్‌కు వస్తున్న ఆయన ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటిస్తారని తెలిపారు.

‘పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయండి’

శ్రీకాకుళం పాతబస్టాండ్: పెండింగ్‌లో ఉన్న ఫారాలు త్వరగా డిస్పోజ్ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎలక్ట్రోరల్ అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆయన శుక్రవారం ఎన్నికలకు సంబంధించి ఎలక్ట్రోరల్ తొలగింపులు, చేర్పులు, మార్పులు, పోలింగు సిబ్బంది, తదితర వాటిపై కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్షించారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఓటర్ల చేర్పులు, తొలగింపులు, తదితర వాటిపై రాష్ట్ర ప్రధాన ఎలక్ట్రోరల్ అధికారికి వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, పోలింగ్ సిబ్బంది గురించి తెలిపారు. ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, మాస్టర్ ట్రైనర్స్‌కు జిల్లా స్థాయిలో శిక్షణ పూర్తి చేసినట్లు వివరించారు. ఎస్పీ జీఆర్ రాధిక మాట్లాడుతూ బోర్డర్ వద్ద చెక్ పోస్టుల ఏర్పాట్లు, అక్కడి పరిస్థితులు, పోలీసులకు ఎన్నికలకు సంబంధించి మాస్టర్ ట్రైనర్స్ పోలీసు అధికారులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అవసరం అనుకుంటే రిటైర్డ్ పోలీసులు, ఎక్స్ ఆర్మీని వాడుకోవచ్చని రాష్ట్ర ప్రధాన ఎలక్ట్రోరల్ అధికారి ఆదేశించారు. వీసీలో జిల్లా నుంచి టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత సూర్యునికి ప్రణామం

- ఆదిత్యుని నిజరూపం తిలకించి పులకించిన భక్తజనం
- రాత్రి మరింతగా పెరిగిన రద్దీ
- అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవ నిర్వహణ




క్షీరధారల తెరలు తొలిగాక అరుదైన అరుణ శిల సాక్షాత్కరించింది. ఏడేడు లోకాలకు వెలుగునిచ్చే సూరీడి నిజరూపం అపురూపమై గోచరించింది. ఆభరణాల అడ్డు లేకుండా ఆదిత్యుని మూర్తిని తిలకించి భక్తజనం పులకించింది. క్షీరాన్న సువాసనలతో ఆలయ ఆవరణ గుభాళించింది. సూర్య జయంతి నాడు అరసవల్లి తన పాత రూపాన్ని ధరించింది. వేవేల భక్తులను సాదరంగా ఆహ్వానించి స్వామిని చూపించింది.



అరసవల్లి/ శ్రీకాకుళం క్రైం/ శ్రీకాకుళం/ శ్రీకాకుళం కల్చరల్/ శ్రీకాకుళం పాతబస్టాండ్/ పీఎన్ కాలనీ/ శ్రీకాకుళం రూరల్/ న్యూకాలనీ/ శ్రీకాకుళం అర్బన్:

అరసవల్లిలో అపురూపమైన నిజరూప దర్శనానికి భక్తులు పోటెత్తారు. సూర్య జయంతి సందర్భంగా శుక్రవారం వేలాది మంది ఆదిత్య క్షేత్రానికి విచ్చేశారు. రథసప్తమి సందర్భంగా గురువారం అర్ధరాత్రి 12.20 గంటలకు సప్తమి ముహూర్తాన ప్రారంభమైన క్షీరాభిషేకం శుక్రవారం ఉదయం 7 గంటల వరకు ఘనంగా జరిగింది. అనంతరం సాయంత్రం 4 గంటల వరకు నిజరూప దర్శనం ఉండడంతో భక్తులు పోటెత్తారు. చీకటి పడే సమయానికి భక్తుల సంఖ్య భారీగా పెరిగిపోయింది. క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. క్షీరాభిషేక సేవలో పాల్గొన్న భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు జరిపించారు. స్వామి నిజరూప దర్శనానికి వచ్చిన వారిని ఆలయ ఈఓ రమేష్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్‌లు గౌరవ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.



ప్రత్యక్షదైవమైన సూర్యదేవునికి నమస్కరిస్తున్న భక్తులు



క్యూలో భక్తులు (ఇన్‌సెట్లో) సూర్యదేవునికి నమస్కారం చేస్తూ..

● ఫలించిన టైమ్ స్లాట్ సిస్టం

స్వామి దర్శనానికి పక్కాగా క్యూలను ఏర్పాటు చేసిన దేవదాయ శాఖాధికారులు, తొలిసారిగా అమలు చేసిన టైమ్ స్లాట్ సిస్టం ఫలించింది. బొంపాడ వీధి కూడలి వద్ద నుంచి మొదలైన దాతల పాసుల లైన్‌కు అర్ధరాత్రి 12.30 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు స్లాట్ విధించారు. అలాగే ఇదే లైన్లలో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నాలుగు స్లాట్‌లుగా వీఐపీ పాసులను అనుమతించిన విధానంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సేవల్లో భాగంగా మంచినీరు, మజ్జిగ, ప్రసాదాలు, పులిహోర, అన్నప్రసాదంతో పాటు వైద్య సేవలు కూడా భక్తులకు అందుబాటులోకి రావడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.



ఉచిత ప్రసాదాల పంపిణీ

● భారీ బందోబస్తు.. అయినా



క్యూలో ఉన్న పసిపాపకు పాలు తాగిస్తున్న కానిస్టేబుల్

బందోబస్తు విషయంలో పోలీసులు భారీగానే ఏర్పాట్లు చేశారు. అయితే తొలి అభిషేక సేవ సమయంలో ధ్వజస్తంభ మండపం వద్ద పోలీసులు పాలక మండలి సభ్యులను అడ్డుకున్నారు. స్వామీజీతో పాటు పట్టువస్త్రాలు, ప్రసాదాలను పట్టుకున్న పాలకమండలి సభ్యులను సైతం ఆలయం లోపలికి విడిచిపెట్టలేదు. దీంతో పాలకమండలి సభ్యులు మండవల్లి రవి, జలగడుగుల శ్రీనివాస్, దుక్క గనిరాజు, మైలపల్లి లక్ష్మి, జోగి మల్లెమ్మలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ కూడా అసహనం వ్యక్తం చేశారు. పాలకొండ ఎమ్మెల్యే కళావతితో పాటు శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీస్వాత్మానంద సరస్వతి అనుచరులు కూడా సింహద్వారం, 80 ఫీట్ రోడ్డు కూడలి వద్ద కొందరు పోలీసులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే తర్వాత మాత్రం పూర్తిగా భిన్నమైన పరిస్థితులు కనిపించాయి. టెక్కలి డీఎస్పీ ఆధ్వర్యంలో పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చేసింది. సీసీ కెమెరాలతో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

● సంప్రదాయబద్ధంగా..



ఇంద్ర పుష్కరిణి వద్ద సూర్యదేవునికి ఇష్టమైన నైవేద్యం చేస్తున్న భక్తులు

రథసప్తమి సందర్భంగా సూర్యోదయ సమయంలో సూర్యునికి ఎదురుగా ఆవు పిడకల పొయ్యిపై ఆవుపాలు, కొత్త బియ్యం, కొత్త బెల్లంతో క్షీరాన్నం వండి, తర్వాత చిక్కుడు కాయలతో రథం తయారుచేసి, ఆదిత్యుని చిత్రపటం పెట్టి, స్వామికి క్షీరాన్నాన్ని సమర్పించారు. ఈ పరిసరాలన్నీ పిడకల పొగతో, పాల పొంగు వాసనలతో నిండిపోయింది.



సాయంత్రం అవుట్ గేట్ వద్ద భక్తుల రద్దీ

● 200 మంది రక్తదానం


రథసప్తమి సందర్భంగా ధర్మశాస్త్ర ట్రస్టు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆలయానికి దర్శనానికి వచ్చిన భక్తుల్లో సుమారు 200 మంది వరకు రక్తదానం చేశారు. స్వచ్ఛంద సేవలకు డాక్టర్ మంత్రి వెంకటస్వామి భక్తులకు రక్తదానంపై అవగాహన కల్పించారు.



స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన దివ్యాంగుడు

దివ్యతేజోమయా ధన్యోస్మి

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ తీరంలో భక్తజన సందోహం





ఇచ్ఛాపురంలో జనసేన-టీడీపీ మధ్య వాగ్వాదం

గ్రూపులదే జోరు.. జనం లేరు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

టీడీపీది బలుపా..? వాపా..? ఈ ప్రశ్నకు ఒకే ఒక్క పర్యటనతో చినబాబు లోకేష్ సమాధానం చెప్పేశారు. శంఖారావం పేరుతో అట్టర్ ఫ్లాప్ షో నిర్వహించి టీడీపీది వాపేనని రుజువు చేసేశారు. ఎంత ప్రయత్నించినా రెండు మూడు రోజుల ముందు నుంచీ ఆ సభలకు రెండు, మూడు వేల మంది కూడా హాజరు కాకపోవడం చూసి అసలుకే ఎసరొచ్చిందని ఆ పార్టీ శ్రేణులు బాధ పడుతున్నాయి. నియోజకవర్గ స్థాయి నాయకుడికొచ్చిన జనాలు కూడా హాజరు కాకపోవడంతో లోకేష్‌కున్న ఇమేజ్, ఆ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం స్పష్టంగా తెలిసిపోయింది.

క్వార్టర్ మద్యం, బండికి పెట్రోల్ కూపన్, మనిషి కింతని సొమ్ము, ప్రయాణించేందుకు వాహనాలు సమకూర్చినప్పటికీ లోకేష్ సభలకు జనాలు రాలేదు. అధికారంలో ఉన్నంత సేపూ ప్రజలను మోసగించి, హామీలను విస్మరించి, అభివృద్ధిని గాలికొదిలేశారన్న అభిప్రాయంతో ప్రజలంతా ఉండటంతో లోకేష్ పర్యటన పేలవంగా సాగింది. లోకేష్ పర్యటనతో అసలుకే ఎసరొచ్చిందని, క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి ఉన్న బలమేంటో తేలిపోయిందని సాక్షాత్తు ఆ పార్టీ సానుభూతిపరులే వాపోయారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస, పాతపట్నం, ఎచ్చెర్ల...ఇలా ఏ నియోజకవర్గంలో చూసినా సభలకు జనాల్లేరు. రెండు మూడు వేల మంది మాత్రమే కన్పించారు. దాదాపు ప్రతి నియోజకవర్గంలో రెండు మూడేసి గ్రూపులు ఉన్నాయి. లోకేష్ పర్యటనతో తమ బలాన్ని నిరూపించుకోవాలని ఆ గ్రూపులు ఆరాటపడ్డాయి. కానీ, ఖాళీ కుర్చీలతో వారికి వాస్తవ పరిస్థితులు చివరికి అర్థమయ్యాయి.



లోకేష్ శంఖారావం అట్టర్ ఫ్లాప్

- బయటపడిన పార్టీ అంతర్గత కుమ్ములాటలు
- జిల్లాకు వచ్చి అభాసుపాలైన చినబాబు
- ఇచ్ఛాపురం, పలాసలో జనసైనికులకు ఘోర పరాభవం
- టెక్కలిలో కళింగ కోమట్లకు తీవ్ర అవమానం



నరసన్నపేట సభలో ఖాళీ కుర్చీలు



పాతపట్నంలో బయటకు వచ్చేస్తున్న మహిళలు

కుమ్ములాటకు కేరాఫ్..

- లోకేష్ పర్యటనతో పార్టీకి మేలు జరగకపోగా, ఆ పార్టీ బలహీనత బయటపడింది. దానికి తోడు గ్రూపు రాజకీయాలు గొడవలకు దారితీశాయి. లోకేష్ సాక్షిగానే కొందరు కొట్టుకున్నారు. దీనికంతటికీ తండ్రీకొడుకులు చెరో వర్గాన్ని ప్రోత్సహించడమే కారణమని సభలకు హాజరైన జనాలే వ్యాఖ్యానించారు.
- పలాసలో టీడీపీలో రెండు వర్గాలు గట్టిగా తన్నుకున్నాయి. సభా ప్రాంగణం వద్ద పిడిగుద్దులు గుద్దుకున్నారు. పలాస, మందస టీడీపీ నాయకుల మధ్య గొడవ జరిగింది.
- నరసన్నపేటలో బగ్గు లక్ష్మణరావు వర్గీయులు లోకేష్‌ను కలిసేందుకు ప్రయత్నించారు. కానీ బగ్గు రమణమూర్తి వారిని అడ్డుకున్నారు. దీంతో గొడవ జరిగింది. దీంతో బగ్గు లక్ష్మణరావు వర్గీయులు సభకు గైర్హాజరయ్యారు. టిక్కెట్ ఆశిస్తున్న బగ్గు శ్రీనివాసరావు కూడా హాజరు కాలేదు.
- శ్రీకాకుళంలో లోకేష్ సభకు ముందు రోజు రాత్రి గొండు శంకర్ ఫ్లెక్సీలను చించేశారు. అదేవిధంగా లోకేష్ పర్యటనలో గొండు శంకర్‌కు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఈయన పేరు కూడా ప్రస్తావించలేదు. గొండు శంకర్‌ను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో ప్రాధాన్యత లేని తాము ఎందుకు పనిచేయాలని ఆయన వర్గీయులంతా తిట్టిపోశారు.
- పాతపట్నంలో కలమట వెంకటరమణ, మామిడి గోవిందరావు వర్గాలు నువ్వానేనా అన్నట్టు వ్యవహరించడంతో లోకేష్ పర్యటనలో ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకుంది. మామిడి ఫ్లెక్సీలను చాలా వరకు చింపేశారు. సభ జరిగిన రోజైతే మామిడి గోవిందరావును వేదికపైకి రానివ్వకూడదని కలమట చివరి వరకు ప్రయత్నించారు. కాకపోతే, మామిడి గోవిందరావు దూకుడుగా వెళ్లడంతో వేదికపైకి రానివ్వకుండా అడ్డుకోలేకపోయారు. ఒకానొక సందర్భంలో ఇరువర్గాలు రక్తం వచ్చేలా కొట్టుకుంటారనే ప్రచారం జరగడంతో అంతా అప్రమత్తమై పరిస్థితిని చక్కదిద్దారు.
- ఎచ్చెర్లలో కళా వెంకటరావు, కలిశెట్టి అప్పలనాయుడు మధ్య బహిరంగంగా ఫైట్ జరిగింది. లావేరులో జరిగిన సభ ప్రాంగణంలోకి కలిశెట్టిని రానివ్వకుండా కళా వెంకటరావు దగ్గరుండి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. చివరికి కలిశెట్టి దూసుకుని వెళ్లడంతో కళా వెంకటరావు చేసేదేమి లేక వెనక్కి తగ్గారు. లేదంటే ఇక్కడ రక్తం వచ్చేలా కొట్టుకునేవారు.

కళింగ కోమట్లకు అవమానం

టెక్కలిలో కళింగ కోమట్లను లోకేష్ తీవ్రంగా అవమాన పరిచారు. తమ సామాజిక వర్గ సమస్యలను చెప్పేందుకు వచ్చిన కళింగ కోమట్ల పెద్దలను కలవకుండా ముఖం చాటేశారు. వీరిలో టీడీపీ నాయకులే ఎక్కువ మంది ఉన్నా లోకేష్ కలవలేదు. పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను నేరుగా కలిసి సమస్యలు తెలుసుకుంటే...లోకేష్ తన దగ్గరికి వచ్చిన వారిని కలవకుండా అవమాన పరిచారని కళింగ కోమటి పెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు.

జనసేన నాయకులకు తీవ్ర అవమానం

- రాష్ట్రంలో టీడీపీ పరిస్థితి దయనీయంగా ఉందన్నది అందరికీ తెలిసిందే. ప్యాకేజీ రాజకీయాలతో చంద్రబాబు పంచన పవన్ కల్యాణ్ చేరినంతగా జనసైనికులు క్షేత్రస్థాయిలో కలవలేకపోతున్నారు. వారి ఆధిపత్యం ఎక్కువైపోతోందని టీడీపీ శ్రేణులు దగ్గరకు చేర్చుకోలేకపోతున్నాయి. దీంతో లోకేష్ పర్యటన ఆద్యంతం జనసేన నాయకులకు అవమానం ఎదురైంది. సభా ప్రాంగణంలోకి వారిని రానివ్వకుండా అడ్డుకున్నారు. లోకేష్ కూడా వారిని కలుపుకోవడానికి ఆసక్తి చూపలేదు. పొత్తు ధర్మం పాటించాలని పవన్ కల్యాణ్ పిలుపు ఇవ్వడమే తప్ప టీడీపీ నుంచి ఆ ధర్మమేంటో కన్పించలేదని జనసైనికులు బాహాటంగానే పెదవి విరిచారు.
- ఇచ్ఛాపురంలో శంఖారావం సభకు రావద్దంటూ జనసేన నేతలను టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో అవమాన భారంతో జనసేన నాయకులు వెనుదిరిగారు.
- పలాసలో జనసేన నాయకులు చాలావరకు లోకేష్ సభకు హాజరు కాలేదు. ఆ పార్టీ నాయకుడు కోత పూర్ణచంద్రరావుకు కనీసం ఆహ్వానం అందలేదు. దీంతో లోకేష్ సభకు జనసైనికులు చాలా మంది దూరంగా ఉండిపోయారు. కొందరు వచ్చినా సభా ప్రాంగణంలోకి రానివ్వలేదు. దీంతో టీడీపీ, జనసేన వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. టెక్కలి, నరసన్నపేటలో కూడా దాదాపు ఇదే జరిగింది.

క్లుప్తంగా

పరీక్ష కేంద్రాల పరిశీలన



శివానీలో పరీక్ష కేంద్రం పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–2 స్క్రీనింగ్ పరీక్ష ఈ నెల 25న నిర్వహించనుంది. ఉదయం 10.30 నుంచి 1 గంట వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాల, చిలకపాలెంలోని శ్రీ శివానీ పాలిటెక్నిక్ కాలేజీలు శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ పీవీఎస్ రామ్మోహన్, ఈఓపీఆర్డీ కణితి ఈశ్వరి పరిశీలించారు. నిబంధనల మేరకు పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు వీరు తెలిపారు.

కూర్మనాథుని సన్నిధిలో దేవదాయ శాఖ ఆర్‌జేసీ



చిత్రపటాన్ని అందిస్తున్న ఈఓ గురునాథం

గార: శ్రీకూర్మం కూర్మనాథుడిని దేవదాయ ధర్మదాయ శాఖ ఆర్‌జేసీ కె.విజయరాజ్ శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేయించారు. క్షేత్ర మహత్యాన్ని ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు తెలియజేశారు. ఆయనతో పాటు దేవదాయ శాఖ పీఎస్ సురేష్, ఈఓ గురునాథం తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాద స్థలంలో పడి ఉన్న మద్దు పురుషోత్తమరావు

పోలాకి: మండలంలోని బెలమర జంక్షన్ వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బెలమర గ్రామానికి చెందిన మద్దు పురుషోత్తమ రావు(30) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం .. రాత్రి సమయంలో పిన్నింటిపేట నుంచి బెలమర వైపు స్కూటీపై వస్తూ అదుపు తప్పి అతివేగంగా ఎదురుగా ఉన్న గోడను ఢీకొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో చికిత్స కోసం నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఆదినారాయణ తెలిపారు. మృతుడికి భార్య, రెండేళ్ల కుమార్తె ఉన్నారు.


చికిత్స పొందుతూ వ్యక్తి..



దుర్గారావు (ఫైల్)

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమదాలవలస మున్సిపాలిటీ మన్నయ్యపేట గ్రామానికి చెందిన జాడ దుర్గారావు(47) అనే వ్యక్తి గాయపడ్డారు. ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. రైల్వే అండర్ టన్నెల్ వద్ద ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన దుర్గారావును 108 సిబ్బంది జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ఆయన భార్య సూర్యరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆయన శుక్రవారం ఆస్పత్రిలో మృతి చెందారు.

కిడ్నీ వ్యాధితో మహిళా సంఘం నాయకురాలు..



జుత్తు నీలవేణి

పలాస: పలాస మండలం నీలావతి గ్రామానికి చెందిన ప్రగతి శీల మహిళా సంఘం నాయకురాలు జుత్తు నీలవేణి కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. ఆమె మృతికి సంతాప సూచికంగా ఉద్దానం ప్రాంతం నలుమూలల నుంచి విప్లవ శ్రేణులు హాజరై ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమొక్రసీ నాయకులు వంకల మాధవరావు, జుత్తు వీరాస్వామి, కె.సోమేశ్వరరావు, మాకన్నపల్లి సర్పంచి సైని దేశయ్య, తెప్పల డిల్లీరావు, కూర్మారాపవు తదితరులు పాల్గొన్నారు.

జనం గుండెల్లో నిలిచే దేవుడు వైఎస్సార్



వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

- నందిగాంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణ

నందిగాం: రాష్ట్రంలోని ప్రతి పేదవాడి గుండెలో నిలిచే దేవుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నందిగాంలో పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఏర్పాటు చేసిన రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. సీదిరి అప్పలరాజు, ధర్మాన కృష్ణదాస్‌తో పాటు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ విగ్రహానికి పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో కృష్ణదాస్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాకు టీడీపీ హయాంలో ఎలాంటి మేలు జరగలేదని తెలిపారు. జిల్లా అభివృద్ధికి కింజరాపు కుటుంబం చేసిందేమీ లేకపోయినా గొప్పలు చెప్పుకొని బాబాయ్ అబ్బాయ్‌లు కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. లోకేష్ విజ్ఞత లేకుండా మాట్లాడుతున్నారని, రెడ్‌బుక్ చూడాలంటే ముందు టీడీపీకి గెలిచే సత్తా ఉండాలన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ పదేళ్లు ఎంపీగా ఉన్న రామ్మోహన్ నాయుడు, విభజన అనంతరం మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడు జిల్లాకు చేసిందేమిటో చెప్పాలన్నారు. పేరాడ తిలక్‌కు ఇంగ్లిష్ రాదని చెప్పే అచ్చెన్నాయుడు పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం పెడితే కోర్టుకు వెళ్లి అడ్డుకోడానికి ప్రయత్నించారని గుర్తు చేశారు. ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే రామ్మోహన్ నాయుడు వల్ల జిల్లాకు ఎలాంటి ప్రయోజనం కలగలేదన్నారు. పార్టీ లేదని అన్న అచ్చెన్నాయుడు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ఓటు వేయాలని అడుగుతున్నారని ప్రశ్నించారు. లోకేష్ జిల్లాలో నిర్వహించిన యాత్రల్లో వలసల గురించి ప్రస్తావించారని, గత టీడీపీ ప్రభుత్వాలు చక్కగా పనిచేసి ఉంటే వలసలు ఎందుకు ఉంటాయని అన్నారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రెండు నెలలు కష్టపడాలని, మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించుకోవాలని సూచించారు. తిలక్ మాట్లాడుతూ సామాజిక వర్గాల వారీగా న్యాయం చేసే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని, జిల్లా అభివృద్ధికి పూర్తి స్థాయిలో తోడ్పాటు అందజేస్తున్న జగనన్నను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పేరాడ భార్గవి నాయకులు జయరాం, ఫల్గుణరావు, కింతల ధర్మారావు, హేమసుందరరాజు, అన్నెపు రామారావు, సువ్వారి వసంత్, చిన్ని జోగారావు, అంబోడి విష్ణు, కింతల శేషగిరి పలువురు నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

లోకేష్‌ది తప్పుడు ప్రచారం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

రణస్థలం: టీడీడీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ గ్రామాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మండిపడ్డారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. లోకేష్‌ది శంఖారావం సభ కాదని శునకానంద సభ అని ఎద్దేవా చేశారు. ఒక్కసారి కూడా ఎమ్మెల్యేగా గెలవని లోకేష్‌కు సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. చంద్రబాబు, పవన్, లోకేష్‌లను ప్రజలు ఎప్పుడో మరిచిపోయారని, ఎన్నికల ముందు వచ్చి సూపర్ సిక్స్ హామీలంటూ ప్రచారం చేస్తే జనం నమ్మబోరని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్నప్పుడు ఒక్క రోడ్డయినా వేశారా అని ప్రశ్నించారు. నీ తండ్రి, తాతలకు రెండెకరాలు ఉంటే, ఇప్పుడు మీ దగ్గర ఎన్ని వేల ఎకరాలు ఉన్నాయో ఎన్ని వేల కోట్లు ప్రజా ధనం స్వాహా చేశారో ప్రజలందరికీ తెలుసన్నారు. నిన్న మీటింగ్‌లో కలిశెట్టిని దగ్గరుండి కళా వెంకటరావు వేదిక వద్దకు రాకుండా అడ్డుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. అంగన్‌వాడీ పోస్టులు, ఆశ వర్కర్, షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులు అమ్ముకున్న ఘనత టీడీపీదేనని అన్నారు. ట్రిపుల్ ఐటీ ఇక్కడకు తెచ్చింది వైఎస్సార్ అయితే, దాన్ని అభివృద్ధి చేసింది వైఎస్ జగన్ అని తెలిపారు. సమావేశంలో లావేరు మండల ప్రత్యేక ఆహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు దన్నాన రాజీనాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా గ్రిగ్స్‌మీట్ ఫైనల్స్



నాలుగు జోన్ల నుంచి హాజరైన క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి గ్రిగ్స్‌మీట్ ఫైనల్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానం వేదికగా శుక్రవారం జిల్లా గ్రిగ్స్‌మీట్ ఫైనల్స్ బాలుర పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి పట్టుదలతో రాణించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఆయన క్రీడాజ్యోతిని వెలిగించి, క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ప్రదర్శించిన మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. క్రీడా మైదానం వద్ద క్రీడాకారులకు జగనన్న గోరుముద్ద పేరిట మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

ముగిసిన బాలురు పోరు

జిల్లా విద్యాశాఖ పరిధిలోని జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో తొలిరోజు బాలురుకు ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, సాఫ్ట్‌బాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ తదితర క్రీడాంశాల్లో క్రీడాపోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన జట్లు/క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. శనివారం బాలికలకు పోటీలను నిర్వహించనున్నట్లు గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు తెలిపారు. నాలుగు జోన్ల నుంచి వివిధ క్రీడాంశాల్లో విన్నర్స్, రన్నర్స్ ఈ ఫైనల్స్ మీట్‌కు హాజరవుతున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎంఈవో–2 కృష్ణారావు, టీపీఎంహెచ్‌స్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖర్, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, బీవీ రమణ, వై.పోలినాయుడు, కె.హరిబాబు, పి.తవిటయ్య, ఎం.ఆనంద్‌కిరణ్, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

పిట్ట చంద్రపతి మృతిపై సంతాపం



పిట్ట చంద్రపతిరావు (ఫైల్)

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేసి బీసీల హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేసిన పిట్ట చంద్రపతిరావు మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం గుండెపోటుతో మరణించారు. ఆయన సొంతూరు కొత్తూరు మండలం బలద గ్రామం. ఆయన విద్యుత్ శాఖలో ఉద్యోగం చేసి రిటైరయ్యారు. జ్యోతిరావుపూలే పార్కు నిర్మాణానికి కృషి చేయడమే కాకుండా అక్కడ బహుజన నాయకుల విగ్రహాలు కూడా ఏర్పాటు చేశారు. పార్లమెంట్ సభల్లో బీసీల సమస్యలను లేవనెత్తానికి ఎంపీలకు అనేకమార్లు లేఖలు రాశారు. జిల్లా కేంద్రంలోని కంపోస్టుకాలనీలో వెనుకబడిన కులాల సామాజిక భవనాల నిర్మాణాలకు ఆయన కృషి చేశారు. బీసీ సంఘ నాయకులు గంజి ఆర్ ఎజ్రా, ఎంఏ భేగ్, కర్రి రంగాజీదేవ్, గద్దిబోయిన కృష్ణయాదవ్, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డీపీ దేవ్, పిట్ట భాగ్య చంద్రరావు, తైక్వాండో శ్రీను, కంత వేణు, బుడుమూరు రాజేష్, బాడాన దేవ భూషణరావు, వాన కృష్ణచంద్, సురేంద్ర, యజ్జల గురుమూర్తి, సురంగి మోహనరావు, బాలిన ప్రసాద్ సంతాపం తెలిపారు. పిట్ట చంద్రపతిరావు మృతిపై రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన మృతి బీసీ లోకానికి తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ కూడా సంతాపం తెలిపారు.

ఆనంద్‌కు ఘనంగా నివాళి



బందారు చిట్టిబాబును సత్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం కల్చరల్: సినీ గాయకుడు ఆనంద్ మనవాడని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు జి.ఆనంద్ జయంత్యుత్సవంలో ఆయన పాల్గొన్నారు. మన జిల్లాకు చెందిన వ్యక్తి ఎంతో ఎత్తుకు ఎదగడం మనకు గర్వకారణమని అన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే స్వభావం ఆయనదని అన్నారు. నిర్వాహక కమిటీ కోరిక మేరకు ఆనంద్ విగ్రహం ఏర్పాటు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ డీసీసీబీ మాజీ చైర్మన్ డోల జగన్, డాక్టర్ మండపాక శారదలు మాట్లాడుతూ ఆనంద్‌తో తమ అనుబంధాన్ని వివరించారు. ముందుగా జి.ఆనంద్ సినీ స్వరమాధురి కార్యక్రమంలో ఆనంద్, ఘంటసాల, ఎస్పీ బాలు గీతాలను పలువురు గాయకులు ఆలపించారు. అనంతరం కళాప్రవీణ బందారు చిట్టిబాబును సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, నిక్కు అప్పన్న డాక్టర్ మాలతి, కనుగుల శ్రీనివాస్, బలివాడ మల్లేశ్వరరావు, ఆనంద్ సోదరులు బాలరాజు, వీర్రాజు, నటుకుల మోహన్, చిట్టి వేంకటరావు, పన్నాల రామకృష్ణ, కెఎల్‌ఎన్ మూర్తి, ఎంవీ కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

కొత్తూరు: బాల్య వివాహాలు చేయడం వల్ల అనర్థాలు ఎదుర్కొనాల్సి వస్తుందని బెడ్స్ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ జి.జగన్నాథం అన్నారు. మండలంలోని కుంటిభద్ర గ్రామ సచివాలయంలో సర్పంచ్ పావని అధ్యక్షతన బాల్య వివాహాల చట్టంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బాలిక వయస్సు 18 ఏళ్లు నిండినప్పుడు మాత్రమే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాల నిషేధిత పరివేక్షణ కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్‌కే భట్టుతో పాటు పలువురు గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు సెపక్‌తక్ర జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి సబ్ జూనియర్స్, జూనియర్స్ బాల బాలికల సెపక్‌తక్ర జట్ల ఎంపికలు శనివారం జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా సెపక్‌తక్ర అసోసియేషన్ చైర్మన్ ఎంఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. శ్రీకాకుళంలోని ఎన్‌టీఆర్ ఎంహెచ్ స్కూల్‌లోని క్రీడా మైదానంలో శనివారం ఉదయం 9గంటల నుంచి ఈ ఎంపికలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, నాలుగు పాస్ ఫొటోలతో ఎంపికలకు హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సంఘ కార్యదర్శి అర్జునరెడ్డి (9949291288)ని సంప్రదించాలన్నారు.

తపాలా ఉద్యోగి పరారు

కాశీబుగ్గ: పలాస మండలం బ్రాహ్మణతర్లా ఉప తపాలా కార్యాలయం పరిధిలో ఉన్న గరుడఖండి తపాలా కార్యాలయానికి చెందిన తపాలా ఉద్యోగి ఖాతాదారుల నగదుతో పరారైన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. కొటబొమ్మాళికి చెందిన యువకుడు ప్రశాంత్ కుమార్ గరుడఖండి తపాలా కార్యాలయంలో బీపీఎంగా పనిచేస్తున్నాడు. ఈ కార్యాలయం పరిధిలో ఉన్న గరుడఖండి, గోపాలపురం, మహాదేవపురం, బట్టుపాడు, సరియాపల్లి, కిష్టుపురం, పాతజగద్దేవుపురం గ్రామాలకు చెందిన 1,025 ఖాతాలు ఉన్నాయి. అందులో కొన్ని ఖాతాదారుల నుంచి సేకరించిన నగదు ఖాతా పుస్తకంలో నమోదు చేసి ఆన్‌లైన్ జమ చేయకుండా సొంతానికి వాడుకున్నాడు. కొంత మంది ఖాతాదారులు ఆన్‌లైన్‌లో తనిఖీ చేయడంతో నగదు లేకపోవడంపై ఆరా తీశారు. ఇదే విషయమై బీపీఎం ప్రశాంత్ కుమార్‌ను సంప్రదించగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆందోళన చెందిన ఖాతాదారులు బ్రాహ్మణతర్లా ఉప తపాలా కార్యాలయాన్ని సంప్రదించారు. దీంతో ఈ నెల 12న బీపీఓఎం పరారైనట్లు తెలిసింది. దీనిపై జిల్లా తపాలా సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఖాతాదారులకు చెందిన కొంత నగదు ఖాతా పుస్తకంలో రాసి ఇచ్చి ఆన్‌లైన్‌లో వేయకుండా సొంతానికి వాడుకోవడం వాస్తవమేనని నిర్ధారించారు. ఈ విషయంలో ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పుస్తకంలో నమోదు చేసిన విధంగా తిరిగి చెల్లిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం గరుడఖండి, బ్రాహ్మణతర్లా తపాలా కార్యాలయంలో విచారణ చేపడుతున్నామని వెల్లడించారు.

ఈపీడీసీఎల్ డైరెక్టర్‌గా శ్రీనివాసమూర్తి బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసమూర్తికి అభినందనలు చెబుతున్న సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం : ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా సి.శ్రీనివాసమూర్తి శుక్రవారం కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఈపీడీసీఎల్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా చేరిన శ్రీనివాసమూర్తి వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ సీజీఎం హోదాలో 2023లో పదవీ విరమణ చేశారు. ఐటీ విభాగంలో విధులు నిర్వర్తించిన సమయంలో ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్, మైఈపీ, ఆన్‌లైన్ పేమెంట్, వాట్సాప్ ఆటోమేటెడ్ చాట్ తదితర ఐటీ ఆధారిత సేవలను రూపొందించారు. డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అతి కీలకమైన పదవిలో నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇంధనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీల్లో సమగ్ర మౌలిక సదుపాయాల ఏర్పాటులో భాగంగా ఇళ్లకు, వీధి దీపాలకు, వాటర్ వర్క్‌లకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు త్వరతగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ వేసవిలో విద్యుత్ సరఫరాలో నాణ్యత పెంచడం ద్వారా వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసమూర్తిని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, డైరెక్టర్లు డి.చంద్రం, ఏవీవీ సూర్యప్రతాప్ అభినందించారు. సంస్థ ఉద్యోగులు, పలు యూనియన్, ఉద్యోగ సంఘాల నాయకులు శ్రీనివాసమూర్తిని సత్కరించి అభినందనలు తెలిపారు.

'సమీకృత కలెక్టరేట్ పనులు పూర్తి చేయాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: సమీకృత కలెక్టర్ కార్యాలయ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న సమీకృత కలెక్టర్ కార్యాలయ భవన సముదాయాన్ని రహదారులు, భవనాలశాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. తుది దశ నిర్మాణంలో ఉన్న అన్ని బ్లాక్‌లను ఆయన స్వయంగా పరిశీలించి, రోజువారీ పనిచేస్తున్న వారి సంఖ్యను రెట్టింపు చేయాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి నెలాఖరుకు నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందని ఇంకా 25 శాతం మిగిలి ఉన్న పనులను ఎప్పటికి పూర్తి చేస్తారని కాంట్రాక్టు ప్రతినిధులను ప్రశ్నించారు. సివిల్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయని, ఈ నెలాఖరు నాటికి గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులను పూర్తి చేసి అప్పగిస్తామని వారు తెలిపారు. నిధుల కొరత ప్రసక్తే లేదని, పనులు ఆలస్యం చేస్తే బిల్లులు నిలిపివేస్తామని హెచ్చరించారు. ఇక నుంచి ప్రతి వారం పనుల పురోగతిపై సమీక్షిస్తామని, నాణ్యతలో రాజీ లేకుండా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతి రావు, ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్, ఈఈ రవి నాయక్, డీఈఈ ఎం.ఎల్.వి.సాగర్, ఏఈఈ పి.టి.రాజు, కాంట్రాక్టు ప్రతినిధి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

● ఆదిత్యుని సన్నిధిలో..



రథసప్తమి నాడు ఆదిత్యుని దర్శనానికి వచ్చిన మంత్రి సీదిరి అప్పలరాజు దంపతులు



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు తదితరులు



ఎమ్మెల్సీ నర్తు రామారావు



ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కుటుంబ సభ్యులు



విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



ఎస్పీ రాధిక దంపతులు